క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గట్టు: నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఆదివారం గట్టులోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ గోవిందు, ఏఈ చిన్నయ్య శనివారం తెలిపారు. గట్టు సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా గట్టు, సల్కాపురం, గంగిమాన్‌దొడ్డి, రాయాపురం, తారాపురం, యల్లందొడ్డి గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధితులకు ఫోన్లు అందజేత



మల్దకల్: ఇటీవల చోరీకి గురైన సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో రికవరీ చేసి శనివారం బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ నందీకర్ తెలిపారు. మద్దెలబండకు చెందిన నందకిశోర్, సద్దలోనిపల్లికి చెందిన కృష్ణయ్య, పెద్దొడ్డికి చెందిన సురేంద్రలకు స్థానిక పోలీసుస్టేషన్‌లో అందజేశామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలనీలకు తాగునీటి సరఫరా



మానవపాడు: మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని బీసీ కాలనీవాసులు, దళితవాడ ప్రజలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం స్పందించిన అధికారులు ఆయా కాలనీల్లో తాగునీరు సరఫరా చేశారు.

1104 యూనియన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

గద్వాలటౌన్: జిల్లా విద్యుత్ శాఖ 1104 యూనియన్ అధ్యక్షుడిగా నర్సింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక హరిత టూరిజం హాల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా, రాష్ట్ర అధ్యక్షుడు వేణు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరి సమక్షంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరేష్, కార్యదర్శిగా రామకృష్ణ, అడిషనల్ కార్యదర్శిగా శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడిగా సతీష్‌కుమార్, డివిజన్ కార్యదర్శిగా శ్యాంసుందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీరేష్‌గౌడ్, అడిషనల్ కార్యదర్శిగా ముక్తార్ ఎన్నికయ్యారు. నర్సింహ వరుసగా నాల్గవసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం విశేషం.

వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే



ధరూరు: మండల పరిధిలోని నాగర్‌దొడ్డికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి తండ్రి లక్ష్మీరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి ఏర్పాటు చేసిన లక్ష్మీరెడ్డి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ధరూరు శ్రీనివాస్‌రెడ్డి, భీంరెడ్డి, కర్రెప్ప, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

కేటీదొడ్డి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శనివారం స్థానికులు తెలిపిన వివరాలు.. స్థానికుడు మహేష్‌కు చెందిన గుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగగా స్థానికులు గుర్తించి మంటలు అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

హనుమాన్ చాలీసా పారాయణం

ఎర్రవల్లి: మండల పరిధిలోని వేముల ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ నాయకులు నర్సింహ గ్రామ కమిటీ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో పారాయణంలో పాల్గొన్నారు.

బోగస్ హాజరుకు చెక్



కేటీదొడ్డిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- జాబ్‌కార్డుతో ఆధార్ అనుసంధానం
- పని ప్రదేశంలో ఐరిష్ నమోదు
- ఈకేవైసీ పూర్తికి ఆదేశాలు



ఇర్కిచేడు ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

కేటీదొడ్డి: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నూతన సంస్కరణలు అమలు చేయనుంది. పనుల్లో నకిలీలను అడ్డుకునేందుకు ఎలక్ట్రానిక్ ఎంబీ(ఈ-ఎంబీ) ఈకేవైసీ విధానాన్ని తీసుకొచ్చింది. పని ప్రదేశంలో వివరాల నమోదు, కూలీల హాజరు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టనుంది. మండలంలో ఈ నెల 1 నుంచి ఈఎంబీ, ఈకేవైసీ నమోదు ప్రక్రియను ప్రారంభించారు.

తప్పులకు ఆస్కారం లేకుండా

గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాల నమోదుకు ఈ-ఎంబీ (ఎలక్ట్రానిక్ మెజర్‌మెంట్ బుక్) విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. పని చేసే ప్రాంతాల వివరాలను ముందుగా లెక్కించి కొలత పుస్తకంలో రాసి తర్వాత ఆన్‌లైన్ ఈఎంబీలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలను ప్రత్యేక యాప్‌తో అనుసంధానిస్తే ఆయా పనుల వివరాలను ఎప్పుడైనా చూసుకోవచ్చు. దీంతో ఒకే చోట రెండు పనులు చేయడం వంటి తప్పిదాలకు ఆస్కారం ఉండదు.

18,862 జాబ్‌కార్డులు

మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో మొత్తం జాబ్‌కార్డులు 18,862 ఉండగా యాక్టివ్ జాబ్‌కార్డులు 7,132 ఉన్నాయి. యాక్టివ్ కూలీలు 13,037 మంది ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు 4,452 మందికి ఈ- కేవైసీని అధికారులు పూర్తి చేశారు.

వేగంగా ఈకేవైసీ నమోదు ప్రక్రియ

పని ప్రదేశం వద్ద కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్ అప్‌లోడ్ చేసేవారు. కానీ సహాయకులు, మేట్లు నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నట్లు గుర్తించారు. సామాజిక తనిఖీల్లో అక్రమాల బయటపడటంతో వీటిని అరికట్టేందుకు కేంద్ర ఎన్ఎంఎంఎస్ యాప్‌ను తీసుకొచ్చింది. దీనిని కూడా దుర్వినియోగం చేస్తున్నట్లు గ్రహించడంతో నకిలీ హాజరు నమోదును అరికట్టేందుకు ఈకేవైసీ విధానమే సరైందని భావించిన ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండలంలో ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తవగానే అమలులోకి తీసుకురానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీని ప్రకారం పనులకు వచ్చిన కూలీల ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తారు. నాలుగు గంటల తర్వాత మరోసారి ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తారు. ఒకే వ్యక్తి రెండు సార్లు ఫొటో దిగి అప్‌లోడ్ చేస్తే కూలీ డబ్బులు విడుదల కావు. నకిలీ నివారణతో ప్రభుత్వ ధనం వృథా కాదని అధికారులు, కూలీలు భావిస్తున్నారు.

కూలీల వివరాలు సేకరణ



మండలంలోని అన్ని గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న కూలీల వివరాలను ఈకేవైసీ చేయిస్తున్నాం. ఈ ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో ఎఫ్ఏఈలకు టీఏలకు ఈ విధానం గురించి అవగాహన కల్పించాం. పని అడిగిన వారందరికీ ఉపాధి కల్పిస్తాం. నకిలీ మస్టర్లకు తావు లేకుండా అర్హులైన కూలీలకు వంద రోజులు పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– కుమార్, ఏపీఓ, కేటీదొడ్డి

సీడ్‌పత్తి రైతులను ఆదుకోవాలి



సంకాపురంలో పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు

అయిజ: అధిక వర్షాలతో పంట నష్టపోయిన సీడ్‌పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లేష్ కోరారు. శనివారం మండలంలోని అయిజ, సంకాపురం శివార్లలో పత్తి పంటను పరిశీలించారు. ఈ ఏడాది 7వేల ఎకరాల్లో రైతులు సీడుపత్తి సాగుచేశారన్నారు. పెట్టుబడులు పెరగడం, దిగుబడి తక్కువవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం స్పందించి సీడుపత్తి రైతులకు పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సభ్యులు నరసింహ, మల్లేష్, శివన్న, తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలి



అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని 100 పడకల ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి సమయంలో కొండచిలువ తిరుగుతుండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. శనివారం సీపీఎం నాయకులు మద్దిలేటి ఆస్పత్రిని పరిశీలించి, కంపచెట్లను, ఆవరణలో చెత్తను, తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెన్నరాయుడు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

శాంతినగర్: మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన వడ్డేపల్లి మండల పరిధిలోని తనగలలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. రాజోళి మండలం చిన్నధన్వాడ గ్రామానికి చెందిన చాకలి సత్యమ్మ తనగల నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యలో తనగలకు చెందిన తిమ్మప్ప తనకు సైగలు చేశాడని, దగ్గరకు వెళ్లి నిలదీయగా బూతులు తిడు తూ చర్నాకోలతో విచక్షణ రహితంగా కొట్టాడని ఫిర్యాదు చేసిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గట్టు: స్థానిక కస్తూర్బా పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో ఆంగ్లం సబ్జెక్టును బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ గోపిలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్‌టీ ఇంగ్లిష్ పోస్టుకు బీఎడ్ ఇంగ్లిష్ మెథడ్ కలిగి, టెట్ అర్హత ఉన్న వారు ఈ నెల 14 లోపు గట్టు కస్తూర్బా పాఠశాలలో స్వయంగా దరఖాస్తు అందజేయాలన్నారు. ఎంపికైన వారు 6 నుంచి 10 వ తరగతి వరకు బోధించాల్సి ఉంటుందన్నారు. బీఎడ్, టెట్‌తో పాటు ఎంఏ ఇంగ్లిష్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

మంజూరా లేక రద్దా ?

- మృతి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు కుటుంబ సభ్యుల అయోమయం
- మృతుల స్థానంలో వేరేవారికి మంజూరు చేస్తున్న వైనం
- లబ్ధిదారు కుటుంబాలకు అందని స్పష్టత



పచ్చర్లలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారు గుడిసె

రాజోళి: సొంతింటి కల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసిన ఎందరో ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని ఆశించేలోగా కల తీరకుండానే కన్నుమూశారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ నిర్మాణం పూర్తికాక ముందే కొందరు, అసలు ప్రారంభించక ముందే మరికొందరు చనిపోయిన ఘటనలు మండలంలో వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు అయోమయంలో పడ్డారు. అర్హులైన మృతుల స్థానంలో కుటుంబ సభ్యులకు ఇస్తారా? లేక మంజూరును రద్దు చేస్తారో తెలియక మృతుల వారసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో నిర్మాణాలు ఇలా..

మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగానే సాగుతున్నాయి. మండలానికి మొదటి విడతలో మొత్తం 269 మంజూరు కాగా అందులో 178 ఇళ్లకు మార్కింగ్ పూర్తి చేశారు. అందులో 111 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్ పూర్తి చేసుకున్నాయి. మిగిలిన 67 ఇళ్లు నిర్మాణాలు పూర్తి కాలేదు. కాగా అందులో ఇంట్లో ఒకరి పేరు మీద మంజూరు కాగా.. మంజూరైన వ్యక్తి చనిపోవడంతో నిర్మించాలా వద్దా అనే అనుమానంతో ఉన్నారు. మండల పరిధిలో సుమారు 10 మంది ఇళ్లు మంజూరైన అనంతరం మృతి చెందారు. మంజూరు వచ్చి మరణించిన వారి స్థానంలో మరొకరి పేరు మీద ఇంటి నిర్మాణం చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, దాని నిబంధనలు తెలియక చాలా మంది నిర్మాణాలు ప్రారంభించడం లేదు. అధికారులు కూడా దీనికి సంబంధించిన విధి విధానాలను వివరించకపోవడంతో నిర్మాణాలు ప్రారంభించుకోవడం లేదని లబ్ధిదారుల కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు అధికారులు, నాయకులు మృతి చెందిన లబ్ధిదారుల స్థానంలో వేరేవారికి ఇళ్లు కేటాయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి నిర్మాణాల విషయంలో వివరణ ఇవ్వాలని, బిల్లుల మంజూరు చేయాలని లబ్ధిదారులు కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మా అమ్మ చనిపోయింది



ఇందిరమ్మ ఇళ్లు మా అమ్మ సావిత్రమ్మ పేరు మీద వచ్చింది. ఈ విషయాన్ని అధికారులు కూడా ధ్రువీకరించారు. ఇటీవల మా అమ్మ చనిపోయింది. ఆ స్థానంలో నేను ఇంటి నిర్మాణం చేసుకోవాలా? లేదా అని తెలియడం లేదు. దీనిపై అధికారులు కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

– రామకృష్ణ, పచ్చర్ల

అర్హులకు ఇస్తున్నాం

ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాక లబ్ధిదారు చనిపోతే, సంబంధిత కుటుంబ సభ్యులకు ఆ స్థానంలో ఇంటిని మంజూరు చేస్తున్నాం. అయితే వారు ప్రభుత్వం సూచించిన నిబంధనలకు అర్హులై ఉండాలి. ఇలాంటి కారణాల దృష్ట్యా లబ్ధిదారుల స్థానంలో పలువురికి ఇంటిని మంజూరు చేశాం. అలాంటి వారు ఉంటే అధికారులను కలిస్తే పరిష్కారం చూపుతాం.

– ఖాజామెయినుద్దీన్, ఎంపీడీఓ రాజోళి

వైభవంగా దేవేంద్రచార్యుల ఆరాధోత్సవాలు



గోపూజలో పాల్గొన్న భక్తులు

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో దేవేంద్రచార్యుల ఆరాధన ఉత్సవాలు శనివారం గోమాత పూజతో ప్రారంభమయ్యాయి. జీవ సమాధి అయిన దేవేంద్రచార్యుల మూలవిరాట్ ఆలయాన్ని కృష్ణానది జలాలతో శుద్ధిచేశారు. ఆదివారం చండీయాగంతో పాటు కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్లు మఠం నిర్వాహకుడు నరసింహాచారి తెలిపారు. చండీయాగంలో నందికొండ జగద్గురుశ్రీ గాయత్రీ పీఠం పీఠాధిపతి డాక్టర్ శ్రీకాంతేంద్రస్వామి, 13న జరిగే పూజా కార్యక్రమాలకు మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అఖండ భజన కార్యక్రమాలు మఠంలో కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై సీపీఎం ఇంటింటి సర్వే

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల గ్రామంలోని 7, 8వ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆయా కాలనీల్లో తాగునీటి సమస్య, వీధిలైట్లు వెలగకపోవడం, డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడం తదితర సమస్యలతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు.

ఆదాయం పెంపునకు 'ధన్‌ధాన్య'కృషి యోజన



అయిజలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ/ఉండవెల్లి: రైతుల ఆదాయం పెంచేందుకు ప్రధాని మోదీ పీఎం ధన్ ధాన్య కృషియోజన పథకం ప్రారంభించారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతులకు కృషిధన్ ధాన్య యోజన పథకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీ డీకే అరుణ కృషి వలన ఉమ్మడి జిల్లాకు రూ.260 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. దేశంలో 100 జిల్లాలకు ఈ పథకం వర్తిస్తుందని, తెలంగాణలో జోగుళాంబ గద్వాల జిల్లా, నారాయణపేట, నాగర్‌కర్నూల్, జనగాం జిల్లాలో పథకం అమలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమసేన్‌రావు, వీరయ్య ఆచారి, రాజశేఖర్, రఘు, భీముడు, రైతులు పాల్గొన్నారు.

- ఉండవెల్లి మండలంలోని కలుగోట్ల గ్రామంలోని పీఏసీఎస్ కార్యాలయంలో పీఎం ధన్‌ధాన్య కృషి యోజన పథక కార్యక్రమాన్ని వీసీలో పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, సీఈఓ భరత్‌కుమార్, డైరెక్టర్లు, మెంబర్లు వీక్షించారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్, సీఐటీయూ నాయకుల నిరసన



మాట్లాడుతున్న కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిపై శనివారం నిరసన తెలిపారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో దేశం పరువు పోయిందని, ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లు రాష్ట్రాల హక్కులను కాలరాసే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. శాసనసభలో ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఎలా తిరస్కరిస్తారని, రాష్ట్రపతికి ఆమోదించడమా తిరస్కరించడమా చేయాలన్నారు. బిహార్ రాష్ట్రంలో 65 లక్షల ఓట్లు గల్లంతైన సంగతి సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని అందరికీ ఓటుహక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



సమావేశంలో పాల్గొన్న కార్మికులు

గద్వాల: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ కార్మికులకు ప్రభుత్వం విడుదల చేసిన మూడు నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన స్వీపర్ల మండల కమిటీ సమావేశం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనప్పటికీ కార్మికులకు అందజేయడం లేదని వివర్శించారు. కార్మికుల వేతనాలు కోసం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రఘు, సంతోషమ్మ, మల్లమ్మ, భాగ్యమ్మ, తదితరలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సీఐటీయూ కృషి



సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

శాంతినగర్: కార్మికుల సమస్యల పోరాటానికి సీఐటీయూ కృషి చేస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో సీఐటీయూ నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా రెండవ మహాసభల గురించి నాయకులు చర్చించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తూ పెట్టుబడి దారులకు లాభాలు తెచ్చిపెడుతోందని ఆరోపించారు. ఏళ్ల తరబడి కార్మికులు సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. కనీస వేతానాలు అమలు చేయకుండా కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని, రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ నెల చివరి వారంలో జిల్లా కేంద్రంలో సీఐటీయూ జిల్లా మహాసభలు జరుగుతాయని, మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంజీవరాజు, హమాలీ భీమన్న, వేణు, శివన్న, కృష్ణవేణి, ఫరీదాబేగం, మమత, వాసు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మునగాలలో కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

ఇటిక్యాల: మండలంలెపి మునగాలలో అనారోగ్యంతో మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ అంత్యక్రియల్లో శనివారం అదనపు కలెక్టర్ నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.28 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసులు, హెచ్ఆర్ గణేష్, ఏపీఎం శివజ్యోతి, టీఏలు, ఎఫ్ఎలు, ఎస్ఎలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అయిజ: మండలంలోని భూంపురం గ్రామానికి చెందిన వీరేష్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో బాధిత కుటుంబ సభ్యులను మండల సీడుపత్తి ఆర్గనైజర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు పరామర్శించి రూ.35 వేలు ఆర్థిక సాయం చేశారు.

గుంతల రోడ్లపై ప్రయాణమెలా ?



చెన్నిపాడులో రోడ్డుపై నిలిచిన మురుగు

మానవపాడు: గుంతల రోడ్లపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారిందని మండల ప్రజలు వాపోతున్నారు. వర్షం కురిస్తే రోడ్లపై మోకాలి లోతు గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గుండా మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రుళ్లు వాహనాలు అదుపు తప్పి ఆస్పత్రుల పాలవుతున్నట్లు వాహనదారులు పేర్కొంటున్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగు

అదే విధంగా మండలని చెన్నిపాడులో సీసీరోడ్డుపై మురుగు ప్రవహిస్తుండటంతో నానా అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. మురుగుతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నడిరోడ్డుపై మురుగు పారుతుందంటున్నారు. పలుమార్లు పంచాయతీ సిబ్బందికి విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..!

ధరూరు: మండల కేంద్రం నుంచి జూరాల డ్యాంకు వెళ్లే దారిలో వైఎస్సార్ చౌరస్తాకు కూత వేటు దూరంలో కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో భారీ ఎత్తున వరద రావడంతో రోడ్డు పక్కన కల్వర్టు కోతకు గురైంది. నిత్యం మన్నాపురం, సోంపురం, గుడ్డెందొడ్డి తదితర గ్రామాల ప్రజలు ఇదే దారి గుండా వెళ్తుంటారు. ఆదమరిస్తే ప్రమాదం పొంచి ఉందని అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



మానవపాడులో చిత్తడిగా రోడ్డు



ధరూరు శివారులో ప్రమాదభరితంగా కల్వర్టు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల — కె.వీరాంజనేయులు - 9642913894
అలంపూర్/అయిజ — ఎన్.గోవర్ధన్ - 9948797122
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి — పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
అశోక్ : 9398469650